కథ

# గురుగు

బి.పి. కరుణాకర్


"నా పేరు..." అని అంటోంటే,

"నాకు తెలుసు. ఇప్పటికి నువ్వే ఆరేడు సార్లు చెప్పావు" అన్నాను.

"నేను నా పేరంత గొప్పవాడి నవుతాననే మోనని నాకా పేరు పెట్టి ఉండాలి. ఆ పేరు నాకింతవరకు సార్థకం కాలేదు. ఈ పరిస్థితుల్లో అవుతుందని నేను అనుకోవడం లేదు. ఆ పేరుతో నన్నెవరయినా పిలుస్తున్నప్పుడు సంతోషంగా ఉంటుంది. గర్వంగా ఫీలవుతాను".

"మా ఊళ్లో డాక్టరు లక్ష్మీకాంతం ప్రసూతి వైద్యశాలకు మంచి పేరుంది. అవసరం అయితే తప్ప ఆ డాక్టరు సిజేరియన్ ఆపరేషన్లు చేయరు. ఇరవయి అయిదు సంవత్సరాల కిందట ఆ ఆస్పత్రిలో పుట్టాను. అమ్మకది మామూలు కాన్పు. ఆ తర్వాత అమ్మకు సంతానం కలగలేదు. ఆ ఆస్పతికి ఆనుకుని 'మోటర్‌బయిక్ రిపేర్ పాయింట్' ఉండేది. ఇప్పుడు అది లదు. నాలాటివాడు ఎవరయినా దాన్ని పాడు చేశారో లేక అదే పాడుబడిపోయిందో తెలియదు. అది ఆస్పత్రి పక్కనే ఉండవలసింది కాదు. నేను పుట్టీ పుట్టగానే అరగంటకు పయిగా మోటరుబయిక్ శబ్దం చెవులు పోయేంత ఎక్కువగా ఉందట. ఆ శబ్దానికి నా చెవులు దెబ్బతిని ఉంటాయని నేను పెద్దయ్యాక రెండు మూడుసార్లు మాటల సందర్భంలో మా అమ్మ నాతో అంది. ఆ సమయంలో ఆ శబ్దం వినిపించకుండా కిటికీ తలుపులు మూసివేయాలని ఎవరికి ఎందుకు తట్టలేదో? మొదటి సంతానంగా అబ్బాయి పుట్టాడని ఆనందంలో పడిపోయారనుకుంటాను. నా సంగతి ఎవరు పట్టించుకుని ఉన్నా అందరిలా నిక్షేపంలా ఉండేవాడిననుకుంటాను".


"ఏ మాటయినా నాతో పెద్దగా చెబితేనేగాని సూదంత మాత్రం వినబడుతుంది. ఎదుటివాళ్ల పెదాల కదలికలతో వాళ్లు ఏం మాట్లాడుతోందీ అర్థం చేసుకోగలను. సంజ్ఞలు ఫాలో అవుతాను. కొద్దిగా మాట్లాడగలను. స్పష్టంగా ఉన్నట్టు అనిపించదు. అవి అమ్మకు, నాన్నకు, నాకు దగ్గరగా ఉండే వాళ్లకు తప్ప వేరేవాళ్లకు అర్థంకావు. తొంబయి అయిదు శాతం బధిరుడిని. ఏ కార్యక్రమానికి అయినా అమ్మా నాన్న నన్ను తీసుకువెళ్తారు. అందరితో మెలగాలని ఉంటుంది. ఆప్యాయంగా పలకరిస్తాను. బావున్నావా అని అడుగుతారు. బావున్నానని అంటాను. నా మాట నాకు వినిపించదు. పలకరించిన వాళ్లతో చాలాసేపు మాట్లాడాలనిపిస్తుంది. ఎవరో తప్ప ఓపికగా నాతో మాట్లాడరు. అమ్మ ప్రతి కార్యక్రమంలో పాల్గొడానికి చాలా ఆసక్తి చూపుతుంది. రాష్ట్ర ప్రభుత్వంలో హోదా ఉన్న ఉద్యోగం ఆమెది. నాన్న కేంద్ర ప్రభుత్వ బీమా సంస్థలో రీజనల్ మేనేజరుగా పని చేస్తున్నాడు. ఇద్దరికీ సమాజంలో, మరీ ముఖ్యంగా మా కుటుంబంలో, మంచి పేరు ఉంది. సామాజిక సేవ గురించి మాట్లాడుతుంటారు కాని సామాజికసేవ అంటే ఇష్టం ఉన్నట్టు నాకు అనిపించలేదు. నాన్న నా పేరున ఆదాపు పన్ను రాయితీలు తీసుకునేవాడు. ఇప్పుడూ తీసుకుంటున్నాడేమో నాకు తెలియదు. ఆదాయపు పన్ను మినహాయింపు మీదున్న శ్రద్ధ నా మీద చూపించి ఉంటే నేనెప్పుడో బాగయి ఉండేవాడిని. అలా అని నన్ను బొత్తిగా నిర్లక్ష్యం చేయలేదు. బెంగుళూరు, న్యూఢిల్లీ, హైదరాబాద్‌లోని బధిరుల కేంద్రానికి నన్ను తను టూర్ల మీద వెళ్తున్నప్పుడు తీసుకెళ్లి చూపించారు. విడవకుండా హియరింగ్ ఎయిడ్ వాడమని, స్పీచ్‌థెరపీకి అందిరిలా మాట్లాడగలనని సూచించారని మా అమ్మ నాతో అంది. హియరింగ్ ఎయిడ్ కొన్నారు కాని బేటరీలది ఒక సమస్య అయింది. అవి మా ఊళ్లో దొరకవు. హైదరాబాద్‌లోను దొరకవు. బొంబాయి నుండి తెప్పించాలి. కష్టపడి బేటరీలు తెప్పించినా రెండు మూడుసార్లు అవి స్కూల్లో ఎక్కడో జారిపోయేసరికి హియరింగ్ ఎయిడ్‌ను స్కూలుకు తీసుకువెళ్లనిచ్చేవారు కాదు. ఇంటి దగ్గర పిల్లలతో ఆడుకునేప్పుడు కూడా దాన్ని పెట్టుకోనిచ్చేవారు కాదు. ఎవరయినా అడిగితే, 'ఈ బేటరీలు చాలా ఖరీదయినవండీ. బొంబాయి నుండి తెప్పించడం కష్టమయిపోతుందండీ. తీరా తెప్పించాక మా వాడు వాటిని జాగ్రత్తగా ఉంచుకోడు. మా వాడికి చెప్పీ చెప్పీ విసుగెత్తిపోయాను. నిజానికి మా వాడికి చెవుడు లేదు. ఎడమెంటు. మీరు పిలిస్తే మీ పిలుపు వాడికిష్టమయితే పలుకుతాడు. లేకపోతే లేదు' అనేవాడు. నా మీద సెవమో, తనను తను సమర్థించుకోవడమో నాకు అర్థమయ్యేది కాదు. అమ్మ మాటలు కూడా అలానే ఉండేవి. సమాజంలో స్థాయి, పరపతి కోసం ఆరాటపడే వ్యక్తి ఆమె. ఇళ్లు, స్థలాలు, బంగారం, బంధువుల్లో పేరు ప్రతిష్టలు దాటి ఆమె తల బయటపెట్టదు. కావలసినదానికంటే చాలా ఎక్కువే సంపాయించారు. ఇంకా దేని కోసం ఆరాట పడుతుంటారో నాకు తెలుసుకోవాలనిపించలేదు. నాకు ఏ విషయంలోనూ తక్కువ చేయలేదు. నేను ఎనిమిదో తరగతిలో ఉండగానే మోటర్‌బయిక్ కొనిచ్చారు. నాన్న కొత్త కారు కొనుకున్నారు. కారు నడపడం నేర్చుకున్నాను. నాన్ననూ అమ్మను వాళ్ల ఆఫీసుల్లో వదిలాక సాయంత్రం వరకు కారు నా చేతిలో ఉండేది. నాన్న ఆఫీసువాళ్లు కారుపెట్రోలు భరించేవాళ్లు కనుక కారును స్నేహితులతో కలిసి ఇష్టమొచ్చినట్టు తిప్పేవాడిని. నా స్నేహితులతో తిరిగితే నాకు మాటలు బాగా వస్తాయని నాన్న ఆశ.



స్పీచ్‌థెరపీ ఖర్చు మిగిలినట్టే కదా. డబ్బు విషయంలో అందరితో అమ్మా నాన్న నిక్కచ్చిగా ఉంటారు. అవసరం అనుకుంటేనే కాని ఎదుటి వారికి సహాయం చేయరు. నా విషయంలో డబ్బు దగ్గర లిబరల్‌గా ఉంటారు. లేకపోతే నేను పోట్లాడతాను. అమ్మ మా బంధువులందరితోనూ బాగా మాట్లాడేది కాని నాన్న మటుకు తనకంటే తక్కువ ఉద్యోగస్తులయిన బంధువులతోనే మాట్లాడడానికి ఆసక్తి చూపించేవాడు. ఎవరితో మాట్లాడుతున్నా తన జీతం గురించి, వచ్చే పెర్క్స్ గురించి చెప్పడం మర్చిపోయేవాడు కాదు. బంధువుల దగ్గర హోదా, జీతాల ప్రసక్తి ఎందుకు తీసుకువస్తుంటాడో నాకు తెలియదు. "మొదట్లో నన్ను ఇంగ్లీషు మీడియం స్కూల్లో చేర్పించారు. వింటున్నట్టు నటించేవాడిని కాని నాకో ముక్క అయినా వినబడేది కాదు. క్లాసులోంచి పారిపోదామనిపించేది. నేను స్కూలుకు వెళ్లనని మొండికేస్తే తెలుగు మీడియం స్కూల్లోకి మార్చారు. అక్కడ నేను నేర్చుకుందేమీ లేదు. ఒక ట్యూటరును పెట్టారు. కొద్దో గొప్పో అలవాటయింది కాని చదువు మీద అట్టే ధ్యాస ఉండేది కాదు. ఎప్పుడు ట్యూషను అయిపోతుందా, ఎప్పుడు బయట పడి స్నేహితులను వేసుకుని ఏ సినిమాకు కాని, అలా ఊరంతా తిరిగి వద్దామని కాని అనిపించేది. జిమ్‌లో చేరాక స్నేహితుల సంఖ్య పెరిగింది. నేను నా స్నేహితులకు ఖర్చు పెట్టే దానికన్నా నా కోసం వాళ్లే ఎక్కువ ఖర్చు పెడుతుండేవారు. డబ్బు విషయంలో నేను జాగ్రత్తగానే ఉండేవాడిని".

"యస్.యస్.సి. మూడో ప్రయత్నంలో కాని గట్టెక్కలేకపోయాను. ఇంటర్‌లో చేర్పించారు. మిగతా విషయాల్లో ఎలా ఉన్నా చదువు గడ్డుగానే ఉంది. కారులో కాలేజీకి వెళ్లిరావడం బాగానే ఉంది. పాత స్నేహితుల్లో కొందరు నన్ను వదిలించుకున్నారు. నేను కొంత మందిని వదిలించుకున్నాను. కొత్త స్నేహితులు వచ్చారు. చాలామంది చదువు మీద ధ్యాస కలిగినవాళ్లు. ఎంత కలుద్దామనుకున్నా కలవలేకపోయాను. కొంత మందయితే నా ముందు మంచిగా మాట్లాడినా నా వెనక నవ్వేవాళ్లు. బహుశా నా అహం గురించి అనుకుంటాను; డిసెబిలిటీ గురించి కాదు. నేనేం చేసేది? అలా పెరిగాను. ఇంటరు చదివాను కాని పూర్తి చేయలేదు. కొన్నాళ్లపాటు కంప్యూటర్‌లో హార్డ్‌వేర్ నేర్చుకుందామని ఒక సెంటర్‌లో చేరాను. రెండు నెలలు కష్టపడ్డాను కాని కొద్దిగయినా వంట పట్టలేదు. చివరగా నా దృష్టి కంప్యూటర్ ఏనిమేషన్ మీదకు మళ్లింది. చేరాను".

"ఏనిమేషన్ కోర్సు చేస్తూ వికలాంగుల కేంద్రంలో స్పీచ్‌థెరపీకి వెళ్తున్న సమయంలో నాకు కృష్ణతో పరిచయం అయింది. కృష్ణ పూర్తి పేరు కృష్ణవేణి. ఆమె నాలాటిదే. ఇరవయి రెండేళ్ల వయసుంటుంది. చెప్పుకోతగిన అందగత్తేమీ కాదు. అయినా నాకు నచ్చింది. మా ఇద్దరికీ పరిచయం అయి నాలుగు నెలలు కాకముందే ఇద్దరం చాలా దగ్గరయ్యాం. సెలవు రోజుల్లో తప్ప కృష్ణను చూడనిది, మాట్లాడని రోజులేదు. స్పీచ్‌థెరపీ క్లాసు అయిపోగానే నా మోటర్‌బయిక్ మీద నేనామెను ఏ పార్కుకో, హోటల్లో కో తీసుకువెళ్లి రెండు మూడు గంటల పాటు కబుర్లు చెప్పుకుంటూ ఉండేవాళ్లం. ఆ తర్వాత నేనే బయిక్ మీద తీసుకెళ్లి వాళ్లింటి దగ్గర వదిలిపెట్టి వస్తుండేవాడిని. వాళ్లింటికి రమ్మని కృష్ణ నన్నెప్పుడూ ఆహ్వానించలేదు. నేను మా ఇంటికి ఆమెను పిలవలేదు. నా గురించి, నా విషయాలు ఆమెకు చెప్పాను కాని తన విషయాలు నాకేమీ చెప్పలేదు. ఎందువలనో తెలియదు. ఆమెను ప్రేమిస్తున్నాను. పెళ్లి చేసుకోడానికి నిశ్చయించుకున్నాను. మా అమ్మా నాన్నలకు చెప్పడమే తరువాయి. వాళ్లు కాదనరనే అనుకుంటున్నాను".



"మా కేంద్రానికి వారానికి ఒకసారి డాక్టరు జయకర్ వచ్చి మమ్మల్నందరినీ పరీక్షించేవాడు. ఆయన ఇప్పటివరకు చాలా ఇంప్లాంటేషన్ ఆపరేషన్లు చేసి వినలేనివాళక్ల్లు వినిపించేలా చేసి మంచి పేరు తెచ్చుకున్నాడు. డబ్బున్నవాళ్ల దగ్గర ఎక్కువే చార్జి చేస్తుంటాడని విన్నాను. నిజమెంతో తెలియదు. డబ్బు లేనివాళ్ల దగ్గర నుండి ఏమీ తీసుకోడని కూడా విన్నాను. నాన్నను తీసుకువచ్చి ఆయన కు పరిచయం చేశారు. ఎనిమిది లక్షలవుతుంది అన్నాడు డాక్టరు జయకర్. నాన్న వెనక్కి తగ్గాడు. డబ్బుల కోసమేమో అనుకున్నాను. డాక్టరుతో మాట్లాడి బయటకు వచ్చాక, "ఇంప్లాంటు చేసినా మాటలు వినబడతాయని నమ్మకం లేదంటున్నాడు" అన్నాడు నాన్న. నిజంగా ఆయన అన్నాడో నాన్న అనుకున్నాడో నాకు తెలియదు. అమ్మ కూడా ఎటువంటి ఆసక్తి చూపించలేదు. చిన్నప్పటినుండి ఇలా జీవించడం అలవాటయినందువలనేమో నాకూ పెద్ద ఆసక్తి కలగలేదు. నా మటుకు నాకు ఈపరిస్థితి బావుంది. జీవితం ఇంతకన్న సుఖంగా ఉంటుం దనుకోను. "మూడు వారాల తర్వాత పది రోజుల్లో తనకు ఇంప్లాంటేషన్ జరగబోతోందన్న వార్త కృష్ణ చెప్పినప్పుడు ఉలిక్కిపడ్డాను. 'నాకు చెప్పకుండా ఇన్ని రోజులు ఎందుకు దాచావు?' అడిగాను. నవ్వి, 'నిన్ను ఆశ్చర్యంలో ముంచెత్తుదామని చెప్పలేదు' అంది. 'చాలా డబ్బులు అవుతాయిగా?' 'లయన్స్ క్లబ్‌వాళ్లు సహాయం చేస్తానన్నారు' అంది. ఆ పూట కృష్ణతో ఎక్కువసేపు మాట్లాడాలనిపించలేదు. ఆమె నాకు దూరమయిపోతున్నట్లనిపిస్తోంది. ఆపరేషను జరిగి సక్సెసయితే ఆమెకు మాటలు వచ్చేస్తాయి. నన్ను పట్టించుకోవలసిన అవసరం ఉండదు. నేను ఎవరిగానో మిగిలిపోతాను".

"రెండు రోజుల్లో కృష్ణకు ఆపరేషన్ అనగా ఆ సాయంత్రం డాక్టరు జయకర్‌గారి దగ్గరకు వెళ్లాను. వ్యక్తి మంచివాడే. మీకులా బధిరులతో చాలా చక్కగా మాట్లాడుతాడు. ఆయనంటే నాకు గౌరవం ఉంది. అయిదు నిమిషాలపాటు మామూలు విషయాలు మాట్లాడాక, 'నాదో కోరిక' అన్నాను. ఏమిటన్నట్టు చూశాడు. 'కృష్ణకు ఆపరేషన్ చేయకండి' అన్నాను. తల అడ్డంగా ఆడించి, 'వీలు కాదు. అయినా అడగడానికి నువ్వు ఎవరివి?' అడిగాడు. ఏం చెప్పాలో నాకు అర్థం కాలేదు. ఆపరేషన్ కాకపోతేనే ఆమెకు నేను ఏమయినాఅవుతాను. ఆపరేషన్ అయితే నేనేమీ కాను. పరి స్థితి చేజార్చుకోవడం నాకు ఇష్టం లేదు. నిగ్రహం కోల్పోతానని నేనూ అనుకోలేదు. చటుక్కున కుర్చీలోంచి లేచి జేబులోంచి కత్తి బయటకు తీశాను... ఆయన్ని భయపెట్టాలనే, ఏంచేయాలని కాదు". అతను ఆగాడు. నాకు తెలియని విషయాలు చాలా చెప్పాడు. ఏవీ ఉపయోగపడతాయని అనుకోను.

అతని ముఖంలోకి చూస్తూ జేబులోంచి సిగరెట్ తీసి వెలిగిస్తోంటే, "నాకూ ఒక సిగరెట్ ఇస్తారా? ఇక్కడ తాగొచ్చా?' అడిగాడు.

"తాగొచ్చు" మరో సిగరెట్ తీసి అతనికిచ్చి, "సిగరెట్ తాగే అలవాటుందా, లేక ఇదే మొదటిసారా?" అడిగాను.

"అప్పుడప్పుడు తాగుతుంటాను" సిగరెట్ పెదాల మధ్య పెట్టుకున్నాక లయిటరుతో సిగరెట్ వెలిగించాను.

అతని చేతులకు బేడీలు ఉన్నాయి.

"డాక్టరు జయకర్ గారికి ఎలా ఉంది?" అడిగాడు.

"డాక్టరుగారి కుడి చేతి బొటనవేలు, చూపుడువేలు చివరి కణుపులు తెగిపోయాయి. అతికించే ప్రయత్నం చేశారు. ముందు ముందు ఆయన ఏ ఆపరేషన్ చేయలేకపోవచ్చు, నువ్వు కత్తిని ఆయన గొంతుకు గురి పెట్టావనుకుంటాను, స్వరపేటికకు గాయమయింది. ఇహ ఆయన మాట్లాడలేడేమో" అన్నాను.